క్లుప్తంగా

అరుదైన 'ఓ-నెగిటివ్' రక్తదానం



రక్తదానం చేస్తున్న పరశురాం

ఆదోని అర్బన్: అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన పరశురాం అనే వ్యక్తి అరుదైన 'ఓ-నెగిటివ్ (బాంబే బ్లడ్ గ్రూపు) రక్తాన్ని దానం చేశాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరు పట్టణానికి చెందిన కె.వి.లక్ష్మికి ఈ రక్తం అవసరం కాగా వారం రోజుల నుంచి బంధువులు వెతుకుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్రలో ఆ రక్తం ఎక్కడ దొరకలేదు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణంలో ఉన్న విరుపాక్షిస్వామికి సమాచారం రావడంతో వారి స్నేహితుడు అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ఉన్న పరశురాంకు చెప్పారు. విషయం తెలుసుకుని హైదరాబాద్ నుంచి కె.వి.లక్ష్మి బంధువులు కారులో బయలుదేరి గుంతకల్‌కు శనివారం అర్ధరాత్రి వచ్చారు. ఆదివారం తెల్లవారుజామున 1:30 గంటలకు గుంతకల్‌లో పరశురామ్ రక్తదానం చేశారు. ఈ రక్తంతో కె.వి.లక్ష్మికి ఆపరేషన్ చేయడం జరుగుతుందని వారు తెలిపారు.

ఉపాధ్యాయ ఉద్యమ కెరటం జమ్మన్న



వై.జమ్మన్న చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు.

కోసిగి: విద్యార్థుల బంగారు భవిష్యత్తే లక్ష్యంగా విద్యాబోధన చేసిన ఉపాధ్యాయ ఉద్యమ కెరటం వై. జమ్మన్న సేవలు మరువలేనివని ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి భానుమూర్తి, రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శులు పాండురంగ, వరప్రసాద్ అన్నారు. ఆదివారం కోసిగి బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో వై. జమ్మన్న సంస్మరణ సభ నిర్వహించారు. ముందుగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఖలీల్ అహ్మద్, రాజమౌళి, మహబూబ్ బాషా, రాముడు, నారాయణ, సంజన్న తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ కుటుంబానికి అండగా ఉంటాం



సర్పంచ్ లింగమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న బుట్టా రేణుక

గోనెగండ్ల : గంజిహళ్లి గ్రామ సర్పంచ్ తోలు లింగమ్మ కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. గంజిహళ్లి గ్రామ సర్పంచ్ తోలు లింగమ్మ రెండు రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఆదివారం సాయంత్రం బుట్టా రేణుక గంజిహళ్లి గ్రామానికి వెళ్లి సర్పంచ్ తోలు లింగమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శివనీలకంఠ, నాయకులు తోలు రాముడు, వీరుపాక్షి రెడ్డి, గంజిల్లయ్య, కోదండ రాముడు, రఫీ, తిక్కయ్య, వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

కౌతాళానికి ఆర్టీసీ బస్సు నడపండి

ఎమ్మిగనూరుటౌన్: ప్రముఖ పుణ్యక్షేత్రంగా వర్ధిల్లుతున్న శ్రీ సయ్యద్ ఖాదర్ లింగస్వామి దర్గా వెలసిన కౌతాళానికి ఎమ్మిగనూరు నుంచి ఆర్టీసీ బస్సులను నడపాలని దర్గా పీఠాధిపతి సయ్యద్ మున్నా సాహెబ్ సంబంధిత ఆర్టీసీ అధికారులను కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఖాదర్ లింగస్వామి దర్గాను దర్శించుకునేందుకు ఎమ్మిగనూరు మీదుగా అధిక సంఖ్యలో భక్తులు కౌతాళం దర్గాకు వస్తారన్నారు. అయితే ఎమ్మిగనూరు నుంచి కౌతాళానికి నేరుగా ఆర్టీసీ బస్సులు లేకపోవడంతో ఆదోనికి వచ్చి వెళ్తుంటారని తెలిపారు. ఈ విషయం ఎమ్మెల్యే బీవీ జయ నాగేశ్వర్‌రెడ్డి దృష్టికి భక్తులు తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు కేవలం వారం రోజులు ఉరుకుంద మీదుగా కౌతాళానికి బస్సు నడిపి ఆ తరువాత నిలిపి వేశారన్నారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వెంకటాపురం కాలనీ మలుపు వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని తప్పించబోయి బైకు అదుపు తప్పి కిందపడటంతో చెన్నాపురం గ్రామానికి చెందిన వీరేష్, రవికుమార్‌లకు గాయాలయ్యాయి. గాయపడ్డ వారిని చికిత్స కోసం ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మొదలైన చవితి సందడి



ఎమ్మిగనూరులో రూ.50వేలు ధర పలికిన గణ నాథుడి విగ్రహం

- వినాయక చవితి ఉత్సవాలకు ముమ్మర ఏర్పాట్లు
- జోరందుకున్న గణనాథుల విగ్రహాల విక్రయాలు



ఎమ్మిగనూరులో విక్రయానికి వుంచిన గణనాథుడి విక్రయాలు

ఎమ్మిగనూరుటౌన్: వినాయక చవతి పండుగకు రెండు రోజులు ఉండగానే పండుగ సందడి మొదలైంది. వినాయక ఉత్సవాలకు సమయం దగ్గర పడుతుండటంతో గణనాథుడి విగ్రహల తయారీ, విక్రయాలు వేగం పుంజుకున్నాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో విగ్రహల వ్యాపారులు గుంతకల్, అనంతపురం, హైదరాబాద్ నుంచి గణనాథుల విగ్రహాలను తయారు చేసే వారిని పిలిపించి కొన్ని ప్లాస్టర్‌ఆఫ్ ప్యారిస్‌తో తయారు చేయిస్తుండగా.. మరికొందరు అందమైన ఆకృతుల్లో గణనాథులను రెడిమెడ్‌గా తెప్పించి విక్రయాలకు ఉంచారు. ఇప్పటికే పట్టణంలో పలుప్రాంతాల్లో ఉత్సవ కమిటీలు గణనాథుల ఏర్పాటు చేసుకునేందుకు సిద్ధమయ్యారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో వందలాది విగ్రహాలను తయారీ పనులను ముమ్మరం చేసుకున్నారు. వినాయకచవితికి సమయం దగ్గర పడటంతో విగ్రహాల కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

200 పైగా విగ్రహాల విక్రయం

గోనెగండ్ల రోడ్డుతో పాటు ఆదోని రోడ్డు, పట్టణంలోని పలు ప్రాంతాల్లో 200 పైగా వినాయక విగ్రహలు విక్రయించినట్లు వ్యాపారులు తెలిపారు. ఒక అడుగు విగ్రహం నుంచి 13 అడుగుల వరకు విగ్రహాలు విక్రయానికి ఉంచారు. రూ.1000 నుంచి రూ.50వేలకు పైగా విలువ కల వివిధ రూపాల్లో, ఆకృతులతో ఆకర్షనీయంగా రూపుదిద్దుకున్న విఘ్నాధిపతి విగ్రహాలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. నియోజకవర్గంతో పాటు మంత్రాలయం నియోజకవరాల్లోని పలు గ్రామాల నుంచి ఉత్సవ



మండపంలో వినాయకుడిని అలంకరిస్తున్న దృశ్యం

కమిటీలు, నిర్వాహకులు విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. కొంద రు ముందుగానే విగ్రహాలను కొనుగోలు చేసి మండపాలకు చేర్చి ముస్తాబు చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. అధికారులు ఇప్పటికే వినాయక విగ్రహల ఏర్పాట్లపై కేంద్ర వినాయక మండలి సభ్యులకు సూచనలిచ్చారు.

ఇప్పుడిప్పుడే కొనుగోళ్లు పెరిగాయి



వినాయక చవితి దగ్గర పడుతుండటంతో విగ్రహాల కొనుగోళ్లు ఇప్పుడిప్పుడే పెరిగాయి. విగ్రహాల తయారీకి ముడి సరుకులు, రంగులు, వాటి తయారు చేసే కార్మికుల కూలీల ధరలు పెరిగిపోయాయి. దీంతో మేము రెడిమెడ్‌గా తెచ్చి విక్రయిస్తున్నా పెద్దగా లాభాలు రావడంలేదు. – చంద్రశేఖర్, విగ్రహాల వ్యాపారి, ఎమ్మిగనూరు



ఆదోనిలో భారీ వినాయకుడిని క్రేన్ సహాయంతో తరలిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

ఉత్సవాలకు గణనాథులు సిద్ధం

ఆదోని సెంట్రల్: పట్టణంలోని వివిధ కూడళ్ల, కాలనీల్లో అయా కాలనీ వాసులు వినాయక చవతి మండపాలను సిద్ధం చేస్తున్నారు. ఎప్పటిలాగే ఈ సంవత్సరం కూడా పండుగను జరుపుకోవడానికి ఏర్పాట్లను చేసుకుంటున్నారు. మండపాలకు లైటింగ్స్, విద్యుత్తు దీపాలతో అలంకరిస్తున్నారు. ఒక పక్క అధికారులు శాంతి యుత వాతవరణంలో పండుగను జరుపుకోవాలని పీస్ కమిటి మీటింగ్‌లను ఏర్పాటు చేసి తగు జాగ్రతలు సూచనలను అందించారు. మరో పక్క వినాయక విగ్రహాలు కనుగోలు నుంచి మండపాల వరకు అన్ని ఏర్పాట్లను చేసుకుంటున్నారు. ఒకరికి మించి ఒకరు పెద్ద విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు పోటీ పడుతున్నారు. విగ్రాహాలను కూడా అడుగులను బట్టి రూ. 20వేల నుంచి 50వేలు, 60వేల పైబడి అమ్ముతున్నారు. ఇంకా భారీ విగ్రహాలయితే రూ. లక్షల్లో పలుకుతాయి. కొంతమంది వ్యాపారులు గుంతకల్లు పట్టణం నుంచి తీసుకొని వచ్చి అమ్మకానికి పెట్టారు. మరికొంత మంది అస్పరి బైపాస్, సిరుగుప్ప క్రాస్ వంటి ప్రాంతాల్లో షెడ్లు వేసుకొని అక్కడే తయారు చేసి అమ్మకాలకు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే పట్టణంలోని అయా కాలనీలకు చెందిన వారు ఆదివారం విగ్రహాలను కనుగోలు చేసి సంబరాలతో మంటపాలకు తరలించడం జరిగింది.



ఆదోనిలో విక్రయానికి సిద్ధంగా ఉన్న గణనాథులు

పర్యావరణాన్ని కాపాడుకుందాం

ఎమ్మిగనూరుటౌన్: మట్టితో చేసిన గణపతులను ప్రతిష్ఠించుకొని నిమజ్జనం చేసి పర్యావరణాన్ని కాపాడుకొనేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పట్టణ సీఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల ఏర్పాటుపై రూపొందించిన పోస్టర్లను పట్టణ ఎస్ఐలు మధుసూదన్‌రెడ్డి, డీవైఎఫ్ఐ మాజీ జిల్లా అధ్యక్షుడు సురేష్‌తో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు రవికుమార్, అజిత్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.



మట్టి వినాయకుడిని ఏర్పాటు చేసుకోవాలని సూచిస్తూ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న పట్టణ సీఐ, ఎస్ఐలు

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల: వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా మండపాల దగ్గర వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని సీఐ విజయ భాస్కర్ సూచించారు. ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వినాయక మండపాల నిర్వహకులతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసుకునే వారు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. విగ్రహం ఏర్పాటుకు విద్యుత్, ఫైర్, పంచాయతీ అధికారుల అనుమతి తప్పనిసరిగా ఉండాలన్నారు. అలాగే వాహనదారులకు, రోడ్డుకు ఇబ్బందులు కలగకుండా మండపాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మండపాల వద్ద డీజేలు పెట్టుకోరాదని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, మండపాలలో 24 గంటలు ఒకరు ఉండేలా చూసుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పంపన్న గౌడ్ కాలనీలో చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని పంపన్నగౌడ్ కాలనీలో ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. కాలనీకి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు మోజెస్ ఇంటికి తాళం వేసి కొన్ని రోజుల క్రితం యూఎస్ఏకు వెళ్లాడు. ఇంటిపై గదిలో కుమారుడు ప్రవీణ్ ఉంటున్నాడు. ఆదివారం ఉదయం ఇంటి తాళం పగలగొట్టి ఉండటం చూసి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఇంటికి వెళ్లి చూడగా తాళం పగలగొట్టి ఉండటం, బీరువా తెరిచి, చీరలు, వస్తువులు చిందబందరగా పడివుంటంతో క్లూస్ టీంకు సమాచారం అందించారు. క్లూస్ టీం వచ్చి ఇంటిలో దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. బీరువా, ఇతర చోట్ల వేలిముద్రలను సేకరించారు. బీరువాలో ఉన్న 2 తులాల బంగారు ఆభరణాలు, ఇంటి బయట ఉన్న పాత స్కూటీ దొంగతనానికి గురైనట్లు బాధితులు చెపుతున్నారు. ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పట్టణ పోలీసులు తెలిపారు.

ఈ పాస్ పద్ధతిలో యూరియా పంపిణీ

కౌతాళం: మండల పరిధిలోని బాపురం రైతు భరోసా కేంద్రంలో తహసీల్దారు రజినీకాంత్‌రెడ్డి ఈ పాస్ పద్ధతిలో యూరియాను మండల వ్యవయాధికారి శేషాద్రి, సీఐ అశోక్‌కుమార్‌ల సమక్షంలో పంపిణీ చేశారు. రైతులందరికీ యూరియా ఇచ్చేల చూడడానికి ఈ పాస్ పద్ధతిని వాడుతున్నట్లు తహసీల్దారు తెలిపారు.

దేవరగట్టులో ప్రత్యేక పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు చేస్తున్న దృశ్యం

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, బండారార్చన, కుంకుమార్చన, మహామంగళారతి, ఇతర అర్చనలతో పాటు ప్రత్యేక పూజలను పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాళమల్లేశ్వరుడిని దర్శించుకోవడానికి ఆంధ్ర, కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఆస్పరి మఠంలో అన్నదానం ఏర్పాటు చేశారు.

ఘనంగా వీరభద్రేశ్వర కుంభోత్సవం

హొళగుంద: శ్రావణమాసం ముగింపులో భాగంగా ఆదివారం స్థానిక వీరభద్రేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి కుంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఏటా జరిగే కార్యక్రమానికి స్థానికులే కాకుండా బంధువులు, చుట్టు పక్కల గ్రామాల భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం స్థానిక పెద్దబావి వద్ద గంగ పూజ, కుంభోత్సవ ఊరేగింపు, శ్రీవీరభద్రేశ్వరస్వామి వేషాదారుడిని వీరకాసి దైవ వచనాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు.



ఎస్కేడీ కాలనీలో గుంత ఏర్పడిన కల్వర్టు.



ఆర్టీసీ కాలనీలో ఇలా..

ఆదమరిస్తే.. అంతే!

ఆదోని సెంట్రల్: పట్టణంలో అయా కాలనీల్లో నిర్మాణం చేపట్టిన కల్వర్టులకు రంధ్రాలు ఏర్పడి ప్రమాదకరంగా ఉన్నాయి. ఎస్కేడీ కాలనీ ఆరవ రహదారిలో కల్వర్టుకూలి మధ్యల గుంత ఏర్పడింది. అదే విధంగా అర్టీసీ కాలనీలో రెండవ రహదారిలో ఉన్న కల్వర్టుకు రంధ్రం ఏర్పడడంతో కాలనీ వాసులు ఇబ్బందులకు గురవుతున్నారు. వాహనదారులు ఏమాత్రం అజాగ్రతగా ఉన్న గుంతలో పడే ప్రమాదం ఉంది. గతం ప్రమాదాలు జరిగిన ఘటనలూ ఉన్నాయి. ఆర్టీసీ కాలనీలో గుంత ఏర్పడి కొన్నేళ్లవుతున్నా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినబడుతున్నాయి. రాత్రి పూట విద్యుత్తు పోయిందంటే చీకటిలో ఎవరు ఎక్కడ పడుతారో తెలియని పరిస్థితి. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి కల్వర్టులకు మరమ్మతులు చేపట్టాలని అయా కాలనీవాసులు కోరుతున్నారు.

వర్షాలతో నష్టపోయిన చేనేతలను ఆదుకోవాలి



వర్షాలతో నష్టపోయిన చేనేత కార్మికులతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక



పుట్టపాశంలో ఉల్లి పంట ఉత్పత్తులను పరిశీలిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరుటౌన్: ఇటీవల కురిసిన వర్షాలకు మగ్గం గుంతల్లో నీరు చేరి, ముడిసరుకు తడిచిపోయి నష్టపోయిన చేనేత కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని శివన్న నగర్‌లో నష్టపోయిన చేనేత కార్మికుల కుటుంబాలను పార్టీ సీనియర్ నాయకుడు బుట్టా శివనీలకంఠ, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు, పార్టీ శ్రేణులతో కలిసి సందర్శించారు. జరిగిన నష్టం గురించి అడిగి తెలుసుకున్నారు. వర్షాలతో గుడిసెల్లో వున్న తమ మగ్గం గుంతల్లో నీరు చేరడంతో పాటు ముడిసరుకు నానిపోయి నష్టపోయామని, చిన్నపాటి వర్షానికే గుడిసెల్లోని మగ్గం గుంతల్లో నీరు చేరిపోతుందని, దీంతో నేత పని చేసుకోలేకపోతున్నామని రాధమ్మ అనే చేనేత కార్మికురాలు ఆమె ఎదుట వాపోయింది. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నేతన్న నేస్తం లాంటి ఏవైనా పథకాలు అందాయా అని చేనేతలను ఆమె అడగ్గా అలాంటి పథకాలేమి ఇవ్వలేదని వారు తెలిపారు. వంద యునిట్లు దాటితే విద్యుత్ బిల్లులు ఎక్కువ వస్తున్నాయని దీంతో తాము ఇబ్బందులు పడుతున్నామని కొందరు నేత కార్మికులు ఆమె దృష్టికి తెచ్చారు.

చేనేతలకు తమ వంతు సహకారం అందిస్తాం

చేనేతలకు తమ వంతుగా సహకారం అందిస్తామని బుట్టా రేణుక అన్నారు. విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం నేత వృత్తిని కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పురాతన కాలం నుంచి మగ్గం గుంతలు ఏర్పాటు చేసుకొని నేత పని చేస్తున్నారని, వారికి స్టాండ్ లాంటి మగ్గాలు ఏర్పాటు చేసుకుంటే నేత పని సాధ్యం కాదని చెప్పారు. కావున ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించి వారికి అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. ఇప్పటికే చేనేతల పిల్లలు నేత వృత్తిపై ఆసక్తి చూపడం లేదని, చేనేత కళ కనుమరుగు కాకుండా చేనేత కార్మికులకు అన్ని విధాలుగా ఆదుకొని ఈ రంగాన్ని కాపాడాల్సిన అవసరం ఎంతైనా వుందని చెప్పారు.

నేతలను ఆదుకున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మాజీ సీఎం వైఎస్ జగనన్న ఏటా నేతన్న నేస్తం కింద రూ.24వేలు ఇచ్చేవారని నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెలిపారు. అదేవిధంగా వంద యూనిట్ల ఉచిత విద్యుత్ అందించేదని అయితే కూటమి ప్రభుత్వం చేనేతలకు ఇస్తామన్న 200ల యూనిట్లు, మరమగ్గాలకు 500ల యునిట్లు ఇస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలు చేయలేదని విమర్శించారు. మాజీ సీఎం వైఎస్ జగన్ చేనేతల అభ్యున్నతికై తీసుకొన్న నాటి నిర్ణయాలతో చేనేత రంగానికి ఊపిరి పోసినట్లు అయిందని ప్రస్తుతం కూటమి సర్కార్ అధికారంలోకి 14నెలలు గడిచి పోయినా ఆ పథకాన్ని పునరావృతం చేయలేదని చెప్పారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం పర్సెంటేజీల సాకు చూపి దివ్యాంగులకు పింఛన్లను నిలిపివేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు ఎంకే శివప్రసాద్, స్థానిక చేనేత నాయకుడు మల్లికార్జున, కౌన్సిలర్ అంపమ్మ, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సునీల్‌కుమార్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు బోయ బజారి, పట్టణ ఉపాధ్యక్షుడు కోటకొండ నరసింహుడు, మైనారిటీ జిల్లా ఉపాధ్యక్షుడు మహబుబ్‌బేగ్, పట్టణ వాణిజ్య విభాగం అధ్యక్షుడు కనికె నాగేంద్ర, పట్టణ ప్రధాన కార్యదర్శి గద్దం అంజి తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోని కూటమి సర్కార్

గోనెగండ్ల: రైతులకు ఆదుకోవడంలో కూటమి సర్కార్ పూర్తిగా విఫలం అయ్యిందని వైఎస్సార్‌సీపీ ఎమ్మిగనూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టా రేణుక అన్నారు. ఆదివారం మండలంలోని పుట్టపాశం గ్రామంలో రోడ్డుపై ఉల్లి గడ్డలను గ్రేడింగ్ చేస్తున్న ఉల్లి పంటల ఉత్పత్తులు, వర్షాలకు దెబ్బతిన్న పత్తి పంటలను ఆమె పరిశీలించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎకరాకు రూ.70వేల నుంచి రూ.80వేలు ఖర్చు వస్తుందని, ఇటీవల కురిసిన వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతియన్నాయని రైతులు తెలిపారు. అరకొరగా పండిన పంటలకు గిట్టుబాటు ధరలు లేవని, వ్యాపారస్తులు క్వింటా ఉల్లి రూ.500లకు అడుగుతున్నారని, దీంతో తీవ్రంగా నష్టపోయి అప్పులపాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. బుట్టా రేణుక మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని, నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వం పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పంటల సాగుకు రైతులు లక్షలాది రూపాయాలు ఖర్చు చేశారని, పంటలకు కూటమి సర్కార్ గిట్టుబాటు ధర కల్పించకుండా వారిని అప్పుల పాలు చేసిందని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యం వలన పంటలు దెబ్బతిన్నప్పుడు రైతులను ప్రభుత్వామే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఖరీఫ్ సీజన్ ఆరంభంలోనే పెట్టుబడి సాయం కింద ప్రతి రైతుకు రైతు భరోసా నగదును రైతు ఖాతాలో జమచేసేవారని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకునేదని గుర్తుచేశారు. టీడీపీ ప్రభుత్వంలో రైతులకు ఇచ్చిన హామీ సుఖీభవ పథకం కింద రూ.7వేలు మాత్రమే వేసి నిరుగార్చడమే గాక పంట నష్టపోయిన రైతుకు పరిహారం కూడా చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా శివ నీలకంఠ, కాశీరెడ్డి, నరసింహ రెడ్డి, గంగాధర్, సీఎం వెంకటేష్, వీరుపాక్షి రెడ్డి, పెద్ద నాగన్న, మత్స్య వల్లబుడు, ప్రతాప్, రవి కుమార్ రెడ్డి, జాను, వెంకటేష్ పాల్గొన్నారు.

28న ముస్లిం మైనారిటీల సమావేశం

ఎమ్మిగనూరుటౌన్: ఈనెల 28వ తేదీన విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించనున్న మైనారిటీ సర్వసభ్య సమావేశానికి ముస్లిం మైనారిటీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పగిడాల అమాన్, నియోజకవర్గ కోఆర్డినేటర్ ఖాశింవలి పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ముస్లిం మైనారిటీలపై జరిగే దాడులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు వీరేష్‌యాదవ్, పార్టీ ముస్లిం మైనారిటీ నాయకులు షబ్బీర్, రఫీక్, హాజి తదితరులు పాల్గొన్నారు.

జీరో సర్వీస్‌తో బదిలీలు చేపట్టాలి

ఆదోని సెంట్రల్: అంతర్ జిల్లా బదిలీల్లో జీరో సర్వీస్‌తో అంతర్ యాజమాన్య బదిలీలను చేపట్టాలని ఎస్టీయూ రాష్ట్ర పురపాలక కన్వీనర్ వీర చంద్ర యాదవ్, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు పట్టణ అధ్యక్షులు రవి డిమాండ్ చేశారు. ఎస్టీయూ భవనంలో ఆదివారం ఎస్టీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. వారు మాట్లాడు పురపాలక, కార్పొరేషన్ పరిధిలో ఉన్న ఖాళీ పోస్టులకు అనుగుణంగా గతంలో అంతర్ జిల్లా బదిలీలను చేపట్టారు. ఇప్పుడు కూడా అదేపద్ధతిలో బదిలీలను చే పట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు భీమరాజు, లోక్యనాయక్, ఉరుకుందప్ప, ప్రసాద్ పాల్గొన్నారు.

బైకు ర్యాలీని జయప్రదం చేయండి

ఆదోని రూరల్: ఆదోనిని కొత్త జిల్లాతో పాటు పెద్దహరివాణం గ్రామాన్ని కేంద్రంగా ప్రకటించాలని కోరుతూ సోమవారం చేపట్టే బైకు ర్యాలీని జయప్రదం చేయాలని పెద్దహరివాణం గ్రామ ప్రజలు, ఆయా పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక సచివాలయం వద్ద వారు సమావేశమై మాట్లాడారు. పెద్దహరివాణం గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని సోమవారం గ్రామం నుంచి ఉదయం 10 గంటలకు పెద్ద ఎత్తున బైకు ర్యాలీగా స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పార్థసారథి కార్యాలయానికి, పెద్ద ఎత్తున తరలివచ్చి వినతి పత్రాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులు, గ్రామస్తులు, ప్రజలు పాల్గొన్నారు.



నాగలదిన్నె - మంత్రాలయం రోడ్డులో ఇరువైపుల కంప చెట్ల దృశ్యం

కంపచెట్లతో ఇబ్బందులు

నందవరం : మండలంలో భారీగా కురిసిన వర్షాలకు ప్రధాన రహదారుల్లో కంప చెట్లు పెరగడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల పరిధిలోని నాగలదిన్నె టూ మంత్రాలయం 18 కిలో మీటర్ల మేరకు ప్రధాన రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు పెరగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వాహనాల రాకపోకలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిలో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. మలుపుల వద్ద కంప చెట్లు పెరిగి మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రధాన రహదారికి ఇరువైపుల పెరిగిన చెట్లను తొలగించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.